క్లుప్తంగా

రామచంద్రమ్మ పండగలో క్రీడా పోటీలు



బాల్ బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభిస్తున్న ఎన్టీపీసీ హెచ్ఆర్ డీజీఎం మహా పాత్ర

పరవాడ: వాడచీపురుపల్లి గ్రామంలో శ్రీ రామచంద్రమ్మ పండగను పురస్కరించుకుని ఉత్తరాంధ్ర షటిల్, బాల్‌బ్యాడ్మింటన్ పోటీలను సింహాద్రి ఎన్టీపీసీ హెచ్ఆర్ డీజీఎం మహా పాత్ర ఆదివారం ప్రారంభించారు. పోటీల్లో పాల్గొనడానికి వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన క్రీడాకారులతో పరిచయం చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడల్లో మంచి ప్రతిభను కనబర్చి తమ సత్తాను చాటుకోవడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రామచంద్రమ్మ ఉత్సవ కమిటీచైర్మన్ మాసవరపు అప్పలనాయుడు, గ్రామ ఉప సర్పంచ్ కూండ్రపు శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు కూండ్రపు తాతాజీ, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆదిత్యునికి అభిషేకాలు



సుజాతనగర్‌లో పూజలందుకున్న సూర్యనారాయణస్వామి

పెందుర్తి: మాఘ మాసోత్సవాల్లో భాగంగా సుజాతనగర్లోని సూర్యనారాయణస్వామి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. వేకువజామున స్వామివారికి పంచ ద్రవ్యాలతో విశేష అభిషేకాలు చేశారు. అలంకరణ చేసి పూజలు జరిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో ఆదిత్యునికి పంచ హారతి, నక్షత్ర హారతి ఇచ్చారు. ఆలయ ధర్మకర్త వాకా చంద్రశేఖర్‌రెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సబ్బవరం పీహెచ్‌సీలో స్వచ్ఛ ఆంధ్ర



పారిశుధ్య నిర్వహణలో పాల్గొన్న డాక్టర్ చంద్రశేఖర్ దేవ్ తదితరులు

సబ్బవరం: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ చంద్రశేఖర్ దేవ్ తెలిపారు. మండల కేంద్రంలోని సబ్బవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం నిర్వహించిన స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రి అవరణలో ఉన్న పిచ్చి మొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించారు. కార్యక్రమంలో పాల్గొన్న పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఎస్ఎస్ఆర్ చక్రవర్తి మాట్లాడుతూ ప్రతి నెల మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సబ్బవరం సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, డాక్టర్ సీహెచ్ ఆశ, డాక్టర్ ఎస్ విద్యాధరి, సీహెచ్‌వో వై.స్వర్ణలత, ఎంపీహెచ్ఈవో జేసుదాసు, రాజీవ్‌లోచన, రాంబాబు, ఐసీటీసీ కౌన్సిలర్ రాజశేఖర్, ఎఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాదానికి రూ.2 లక్షల విరాళం



దాత సత్యవతికి బాండ్ అందిస్తున్న ఏఈవో

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి పార్వతీపురం మన్యం జిల్లా, బలిజిపేట మండలం, అరసాడ గ్రామానికి చెందిన కళ్యంపూడి సత్యవతి రూ.2 లక్షల విరాళాన్ని నగదు రూపంలో అందించారు. దేవస్థానం తరఫున దాతకు ప్రొటోకాల్ ఏఈవో వి.రాంబాబు, సూపరింటెండెంట్ విక్రమ్ బాండ్ ఇచ్చారు. దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రాన్ని బహూకరించారు. కార్యక్రమంలో ప్రొటోకాల్ సూపరింటెండెంట్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

దారికాచి.. దోపిడీ

పెందుర్తి: ఇద్దరు వ్యక్తులు దారికాచి తమతో గొడవపడి నగదును తస్కరించారని ఓ వ్యక్తి పెందుర్తి క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. క్రైం ఎస్ఐ డి.సూరిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. వడ్లపూడి ప్రాంతానికి చెందిన సాయికిరణ్‌కు నాయుడుతోట సాయిదుర్గానగర్‌లో ఇల్లు ఉంది. ఆదివారం సాయంత్రం ఇంటిని చూద్దామని వచ్చి, స్నేహితులతో కలిసి సమీపంలోని బార్‌కు వెళ్లాడు. తిరిగి సాయిదుర్గానగర్‌లోని ఇంటికి వెళుతుండగా ఇద్దరు వ్యక్తులు అడ్డుకుని, కిరణ్‌తో పాటు అతని స్నేహితుడిని కొట్టి కిరణ్ జేబులో ఉన్న రూ.5 వేలు లాక్కున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

కోరి వచ్చారు.. వెళ్లిపోతున్నారు!

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నియోజకవర్గంలో ప్రభుత్వ స్థలాల ఆక్రమణలు తారాస్థాయికి చేరుకున్నాయి. చెరువులు, గెడ్డలు, పోరంబోకు భూములన్నీ కూటమి నేతల చెరలో చిక్కుకున్నాయి. వాటికి అదనంగా అక్రమ మైనింగ్. వీరి ఆధిపత్య పోరులో ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకోవడం పెరిగింది. చర్యలకు దిగితే ఒక వర్గం, లేకుంటే ఇంకో వర్గం అధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నాయి. దీంతో రెవెన్యూ అధికారులు అడకత్తెరలో పోకచెక్కలా నలిగిపోతున్నారు. ఈ బాధ భరించలేక బదిలీలు చేయించుకుని, వేరే ప్రాంతానికి వెళ్లిపోతున్నారు.



- 'కూటమి' పెద్దల ఒత్తిడి తట్టుకోలేకపోతున్న యంత్రాంగం
- ఒక్కొక్కరుగా జారుకుంటున్న ఉన్నతాధికారులు
- ఇప్పటికే ఓ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రిక్వెస్ట్ బదిలీ
- అదే బాటలో మరో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్?
- లాంగ్ లీవ్‌లో పెందుర్తి సబ్ రిజిస్ట్రార్!

అధికారులా.. వాళ్లెంత!

కూటమిలో ఉన్న టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు బయటకు నవ్వుతూ పలకరించుకుంటూ లోలోపల మాత్రం కత్తులు దూసుకుంటున్నారు. అయితే ఆ కత్తుల వేటుకు అధికారులు బలవుతున్నారు. నాయకులు తమ పనులు చేయించుకోవడం కోసం అధికారులు ఎలా పోయినా ఫర్వాలేదన్న చందంగా వ్యవహరిస్తున్నారు. నాయకులు, వారి అనుచరుల పనులు జరగడం కోసం అధికారులను చులకనగా చూస్తూ ఒత్తిడి తీసుకొస్తున్నారు. దీంతో వీటిని భరించలేని అధికారులు కోరి మరీ బదిలీలు చేయించుకుని పెందుర్తి నుంచి నిష్క్రమిస్తున్నారు.

పెందుర్తి: నియోజకవర్గంలో పనిచేయడానికి అన్ని శాఖల అధికారులు అమితాసక్తి చూపుతారు. ముఖ్యంగా నియోజకవర్గ కేంద్రం పెందుర్తి మండలంలో పోస్టింగ్‌ల కోసం తీవ్ర పోటీ ఉంటుంది. సిఫార్సు లేఖల కోసం ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తుంటారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొత్తలో అదే జరిగింది. ప్రస్తుతం సీన్ రివర్స్ అయింది. ఏడు నెలల క్రితం పోస్టింగ్‌ల కోసం నానా ప్రయాస పడి ఇక్కడకు వచ్చిన అధికారులు ఇప్పుడు పీచేముడ్ అంటున్నారు. కూటమి ముఖ్యనేతల ఆధిపత్య పోరులో నలిగిపోతూ ఇక్కడ పనిచేయడానికి బెంబేలెత్తిపోతున్నారు. ఒత్తిడిని తట్టుకోలేక 'అనారోగ్యం', ఇతర కారణాలు చూపి చల్లగా జారుకుంటున్నారు.

'అనారోగ్యం'తో లాంగ్‌లీవ్!

సుజాతనగర్ సమీపంలోని ఓ వివాదస్పద లేఅవుట్ కోర్టు వివాదంలో ఉంది. ఓ వర్గం వారికి అనుకూలంగా తీర్పు వచ్చింది. మరో వర్గం దానిపై స్టే కోసం ప్రయత్నం చేస్తోంది. కానీ మధ్యలో ఈ వివాదం రాజకీయ రంగు పులుముకుంది. టీడీపీ, జనసేన నేతలు రంగంలోకి దిగారు. జనసేనకు చెందిన ఓ ప్రజాప్రతినిధి ఆ లేఅవుట్‌లో స్థలాలను రిజిస్ట్రేషన్ చేయాల్సిందిగా సబ్‌రిజిస్ట్రార్‌పై తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చారు. టీడీపీకి చెందిన మరో ప్రజాప్రతినిధి రిజిస్ట్రేషన్‌లు చేయొద్దని ఒత్తిడి చేశారు. దీంతే ఈ ఒత్తిడి భరించలేక సదరు సబ్ రిజిస్ట్రార్ 'అనారోగ్యం'తో లాంగ్ లీవ్ పెట్టేశారు.

బదిలీల పరంపర..

నియోజకవర్గంలో అక్రమ మైనింగ్, ప్రభుత్వ స్థలాలు, చెరువుల కబ్జాపై కూటమి నేతల్లోనే విభేదాలున్నాయి. తరచూ పరస్పరం ఫిర్యాదులు చేసుకుంటున్నారు. అయితే మిత్రపక్షంలోని ఓ పార్టీకి చెందిన 'ముఖ్యనేత'చర్యలు తీసుకోవద్దని అధికారులకు చెప్తాడు. మరో పార్టీకి చెందిన 'ముఖ్యనేత'తప్పనిసరిగా చర్యలు తీసుకోవాల్సిందేనని హుకుం జారీ చేస్తాడు. దీంతో ఒత్తిడి తట్టుకోలేక ఓ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తనను ఇక్కడి నుంచి ఎక్కడికైనా బదిలీ చేయండి, వెళ్లిపోతానంటూ ఉన్నతాధికారుల కాళ్లావేళ్లాపడి బదిలీ చేయించుకుని వెళ్లిపోయారు. ఆమె స్థానంలో వచ్చిన మరో అధికారికి కూడా ఇదే పరిస్థితి. దీంతో ఆమె కూడా పెందుర్తికి బైబై చెప్పేందుకు సిద్ధమయ్యారు. ఇలా చెప్పుకుంటూ పోతే మండల, పంచాయతీ స్థాయిలో ఎందరో అధికారులు కూటమి నేతల పోరుకు బలవుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



వెన్నలపాలెం–ఎన్టీపీసీ రహదారిలో భయపెడుతున్న నేల బావి

పరవాడ: వెన్నలపాలెం–ఎన్టీపీసీ రహదారిలో రోడ్డు పక్కన ఉన్న నేల బావి ప్రయాణికులను భయపెడుతోంది. వ్యవసాయదారులు తమ పంట పొలాలకు నీరందించేందుకు వీలుగా గతంలో ఈ నేల బావిని తవ్వారు. కాలక్రమేణా భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో బావి ఎండిపోయింది. వెన్నలపాలెం నుంచి పంట పొలాలకు వెళ్లేందుకు రైతులు బావి పక్క నుంచి కాలి బాటను ఏర్పాటు చేసుకున్నారు. ఆ కాలిబాటను కొన్నేళ్ల క్రితం బీటీ రోడ్డుగా మార్చారు. రోడ్డు పక్కన వృథాగా ఉన్న నేల బావిని మాత్రం పూడ్చకుండా వదిలేశారు. ఎన్టీపీసీ ఏర్పాటు తర్వాత ఈ రహదారిని ప్రయాణికులు అధికంగా వినియోగిస్తున్నారు. మెయిన్ రోడ్డులో కాలుష్యానికి భయపడి చాలా మంది ప్రయాణికులు ఈ దారి మీదుగానే వెళ్తున్నారు. ఎన్టీపీసీ, ఫార్మాసిటీ, హిందూజా పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు, ఉద్యోగులు కూడా ఈ రోడ్డునే ఆశ్రయిస్తున్నారు. చీకటి సమయంలో ఎక్కడ ఈ నేల బావిలో పడిపోతామోననే ఆందోళనలోనే రాకపోకలు సాగిస్తున్నారు. ఈ నేలబావి పూడ్చివేతకు చర్యలు తీసుకోవాలని అధికారులను ప్రయాణికులు కోరుతున్నారు.

వివాహానికి వెళ్లి వస్తూ బాలుడు మృతి



గుదలం వీధి గ్రామం వద్ద ప్రమాదానికి గురైన బైక్



సాయి చరణ్ మృతదేహం

జి.మాడుగుల: మండలంలోని నుర్మతి రోడ్డులో ఆదివారం జరిగిన ప్రమాదంలో విశాఖ జిల్లా పెందుర్తికి చెందిన ఓ బాలుడు మృతి చెందాడు వివరాలు ఇలా ఉన్నాయి. జి.మాడుగుల మండలం నుర్మతి పంచాయతీ అనర్బ గ్రామంలో జరిగిన వివాహానికి పెందుర్తి నుంచి కర్రి సాయి చరణ్(17) అనే బాలుడు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో ద్విచక్రవాహనం మీద వస్తుండగా గుదలం వీధి వద్ద బైక్ అదుపుతప్పి, ప్రమాదానికి గురయ్యాడు. కిందపడిన సాయి చరణ్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు.ఈ ప్రమాదంపై పోలీసులకు ఫిర్యాదు అందాల్సి ఉంది.

వైభవంగా భూలోకమాంబ పండగ



పూజలందుకున్న భూలోకమాంబ



భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న సుకవాసి సతీష్

పెందుర్తి: మండలంలోని గుర్రంపాలెం పంచాయతీ అక్కిరెడ్డిపాలెంలో వెలసిన మూడూళ్ల గ్రామదేవత భూలోకమాంబ పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉదయం నుంచి భూలోకమాంబకు విశేష అభిషేకాలు చేసి, పూజలు జరిపారు. భక్తులు పసుపు–కుంకుమలు, చీరలు సమర్పించారు. భజన చెట్లను ఊరేగించి పూజలు చేశారు. చిన్నారులు రంగులరాట్నాలు ఎక్కి సంబరపడ్డారు. డ్యాన్స్ బేబీ డ్యాన్స్‌తో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సీనియర్ నాయకుడు సుఖవాసి సతీష్, నక్కా మహేష్, అప్పారావు, బాలు, తరుణ్, ప్రసాద్, నూకరాజు, చినఅప్పారావు, మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల నైపుణ్యాభివృద్ధికి కృషి

ఉక్కు ఎల్‌డీసీ విభాగాధిపతి ఠాగూర్



ఎల్‌డీసీ నూతన విభాగాధిపతి ఠాగూర్‌ను సత్కరిస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల నైపుణ్యాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని స్టీల్ ప్లాంట్ లెర్నింగ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్ (ఎల్‌డీసీ) నూతన విభాగాధిపతి టి.కె.ఎస్.ఆర్ ఠాగూర్ అన్నారు. ఎల్‌డీసీ విభాగాధిపతిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు ఆదివారం ఠాగూర్‌ను కలిసి గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌ఆర్‌డీ ద్వారా అనేక స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలు, పలు కోర్సుల్లో శిక్షణ ఇచ్చి వారి నైపుణ్యాన్ని పెంపొందించడానికి శాయశక్తులా కృషి చేస్తున్నామన్నారు. అసోసియేషన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు బి.తౌడన్న, బయ్యే మల్లయ్య మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల కోసం హెచ్‌ఆర్‌డీ ద్వారా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.సత్యనారాయణ, కోశాధికారి కె.వి.రత్నం, పుల్లారావు, మోహన్‌బాబు, సాయిప్రసాద్, టర్కీ, గణేష్, రామన్న, భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

బాల్యం నుంచి భద్రతపై అవగాహన అవశ్యం



ప్రసంగిస్తున్న వర్క్స్ సీజీఎం మొహంతి

ఉక్కునగరం: చిన్న వయసు నుంచే విద్యార్థులకు భద్రతపై అవగాహన కల్పించడం అవశ్యమని.. తద్వారా బాధ్యత కలిగిన పౌరులుగా తీర్చిదిద్దగలమని స్టీల్‌ప్లాంట్ సీజీఎం (వర్క్స్) రంజన్ మొహంతి అన్నారు. జాతీయ భద్రతా దినోత్సవం సందర్భంగా ఆదివారం ఉక్కు మల్టీపర్పస్ హాలులో విద్యార్థులకు వ్యాసరచన, పోస్టర్, నాటిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికసిత భారత్ 2047 లక్ష్యసాధనలో భద్రత కీలక పాత్ర పోషిస్తుందన్నారు. పోటీల్లో ఉక్కునగరం, పెదగంట్యాడ ప్రాంతాలకు చెందిన సుమారు 500 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ సీజీఎం ప్రవీణ్‌కుమార్, జీఎంలు యు.ఎస్.బెహరా, భద్రతా విభాగాధిపతి ఎం.ఎస్.ఎన్.రాజు, డీజీఎం వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తీరంలో ఆలివ్ రిడ్లే తాబేళ్ల కళేబరాలు

పీక్కు తింటున్న కుక్కలు.. పట్టించుకోని అధికారులు



ముత్యాలమ్మపాలెం తీరంలో ఆలివ్ రిడ్లే తాబేలు కళేబరాన్ని తింటున్న కుక్క



తీరంలో పడి ఉన్న ఆలివ్ రిడ్లే తాబేలు కళేబరం

పరవాడ: ముత్యాలమ్మపాలెం సముద్ర తీరంలో ఈ మధ్య కాలంలో ఆలివ్‌రిడ్లే తాబేళ్లు తరచూ మృత్యువాత పడుతున్నాయి. అవి ఒడ్డుకు కొట్టుకురావడంతో, వీధి కుక్కలు పీక్కుతింటున్న దృశ్యాలు ఆదివారం దర్శనమిచ్చాయి. ఇటీవల మత్స్యకారుల వలలకు పదుల సంఖ్యలో తాబేళ్లు చిక్కాయని వాటిని మళ్లీ సముద్రంలో విడిచిపెట్టినట్లు గంగపుత్రులు చెప్పారు. ఫార్మాసిటీ పరిశ్రమల ద్వారా విడుదలైన వ్యర్థ రసాయనాలు సముద్ర జలాల్లో కలవడం వల్లే తాబేళ్లు మృతి చెంది ఉండవచ్చని మత్స్యకారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సముద్ర జలాల్లో మృతి చెంది తీరానికి చేరిన కళేబరాలతో ఆ ప్రాంతాల్లో దుర్వాసన వెదజల్లుతోందని సందర్శకులు వాపోతున్నారు. కనీసం తీరానికి కొట్టుకు వచ్చిన తాబేళ్ల కళేబరాలను పూడ్చేలా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, భక్తులు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన జరిపారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం జరిపారు. 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో అష్టోత్తరశతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేష వస్త్రాలను అందించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులను వేంజేపచేసి ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

ఆత్మారాధనతోనే మానవులకు మోక్షం



మహాశివరాత్రి విశిష్టతను వివరిస్తున్న ప్రబోధ సేవా సమితి ప్రతినిధులు

పరవాడ: మండలంలోని జాజులవానిపాలెం, గొర్లివానిపాలెం గ్రామాల్లో త్రైత సిద్ధాంతం–ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక ప్రతినిధులు త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాలు, మహాశివరాత్రి పండగ విశిష్టతపై ఆదివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. శివలింగంపై ఉన్న మూడు విభూది రేఖలు జీవాత్మ, ఆత్మ, పరమాత్మలకు గుర్తులని ఇందూ జ్ఞాన వేదిక అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. ఆత్మను ఆరాధిస్తే మానవుడు మోక్షం పొందుతాడని అందుకే విభూది రేఖల్లో మధ్య ఉన్న రేఖకు ఎర్రని బొట్టు పెడతారని పేర్కొన్నారు. మాయ పట్ల జాగృతి కలిగి, జ్ఞానం పొంది ఇతరులకు దైవ జ్ఞానం తెలియజేయడమే శివరాత్రి జాగరణ ఆంతర్యమన్నారు. అందుకే శివరాత్రిని మోక్ష రాత్రి అని కూడ వ్యవహరిస్తారని తెలిపారు. జీవితంలో ఓ ఏడాది గడచిపోయిందని తెలియజేయడానికే ఈ పండగలు వస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇందూ జ్ఞాన వేదిక ప్రతినిధులు రమేష్, రమణ, లక్ష్మి, సత్యవతి, దేవి సర్వధారి, కన్య, అప్పలనాయుడు, నాగమణి, పద్మ, అప్పారావు, మంగ, మల్లేష్, అక్షయ్‌కుమార్ పాల్గొన్నారు.

అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలి

వసతిగృహ బాలికలతో సీఐ సతీష్‌కుమార్



విద్యార్థుల హాజరు పట్టీని పరిశీలిస్తున్న సీఐ సతీష్‌కుమార్

పెందుర్తి: పాఠశాలలు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వి.సతీష్‌కుమార్ సూచించారు. స్థానిక ఎస్సీ బాలికల వసతిగృహంలో ఆదివారం విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థుల హాజరు పట్టీని పరిశీలించారు. భోజన వసతి గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మహిళలకు, ఆడపిల్లలకు రక్షణగా ఉన్న చట్టాలపై అవగాహన కలిగించారు. పలు అంశాలపై సూచనలు, సలహాలు అందించారు. మొబైల్ ఫోన్లు, ఇతర వ్యామోహాలకు గురికాకుండా ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. బయటకు వెళ్లి వస్తున్న సమయంలో ఇతరుల నుంచి ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా హాస్టల్ వార్డెన్ దృష్టికి గానీ, తమ దృష్టికి గానీ తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. వార్డెన్ సత్యవతి, సిబ్బంది పాల్గొన్నారు.

చికెన్ షాపులు వెలవెల

- బర్డ్ ఫ్లూ కలకలంతో తగ్గిన అమ్మకాలు
- ఆందోళన చెందుతున్న వ్యాపారులు



వెలవెలబోతున్న చికెన్ దుకాణం



పెదగంట్యాడలో చేపల మార్కెట్

పెదగంట్యాడ: రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో బర్డ్‌ఫ్లూ కలకలం రేగడంతో దాని ప్రభావం ఇక్కడ కూడా పడింది. బర్డ్‌ఫ్లూ వ్యాపిస్తుందనే ప్రచారంతో చికెన్, కోడిగుడ్లు తినేందుకు ప్రజలు హడలిపోతున్నారు. కొద్ది రోజులు ఈ రెండింటికి దూరంగా ఉంటే మంచిదని కొనుగోలుకు ఆసక్తి చూపడం లేదు. చికెన్ దుకాణాలు వినియోగదారులు లేక వెలవెలబోతున్నాయి. దీంతో వ్యాపారస్తులు ఏమీ తోచని స్థితిలో ఉన్నారు. మరోవైపు కిరాణా దుకాణాల్లో గుడ్లు సైతం కొనుగోలు చేసే వారి సంఖ్య తగ్గిపోయింది. పెదగంట్యాడ మండలం పరిధిలోని వివిధ గ్రామాల్లో చికెన్ సెంటర్లు బోసిపోయి కనిపిస్తున్నాయి. ప్రధానంగా నడుపూరు, నెల్లిముక్కు ప్రాంతాల్లో బోణీ కూడా కాలేదని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రభావం రాష్ట్ర వ్యాప్తంగా కొద్దిరోజులు పాటు ఉంటుందనే అభిప్రాయం అనేక మంది వ్యక్తం చేస్తున్నారు.

పడిపోయిన చికెన్ ధరలు

వారం కిందట వరకూ కిలో చికెన్ ధర రూ. 230 నుంచి రూ.240 వరకూ ఉండేది. ప్రస్తుతం ధర కిలో రూ.180కి పడిపోయింది. అయినా కొనేందుకు కొనుగోలుదారులు ముందుకు రావడం లేదని వ్యాపారస్తులు ఆవేదన చెందుతున్నారు.

మటన్, చేపలకు డిమాండ్

బర్డ్‌ఫ్లూ భయంతో మాంసాహారులు చికెన్ కొనేందుకు వెనకడుగు వేస్తున్నారు. దీంతో చేపలు, రొయ్యలు, మటన్‌కు డిమాండ్ పెరిగింది. ఆదివారం ఆయా దుకాణాలు కిటకిటలాడాయి. పెదగంట్యాడ, నెల్లిముక్కు, మదీనాబాగ్ చేపల దుకాణాల వద్ద ఆదివారం విపరీతమైన రద్దీ కనిపించింది. దీన్ని ఆసరాగా తీసుకుని వ్యాపారులు ఒక్కసారిగా వాటి రేట్లు పెంచేశారు.

విశేషంగా సీతారాముల తిరువీధి



తిరువీధి నిర్వహిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

సింహాచలం: 98వ వార్డు పరిధి సింహపురికాలనీలో జరుగుతున్న సీతారామాలయ 22వ వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం రాత్రి సీతారాముల తిరువీధిని విశేషంగా నిర్వహించారు. తమ ఇళ్ల ముందుకు వచ్చిన సీతారాముల విగ్రహాలకు గ్రామస్తులు హారతులుపట్టారు. స్వామివార్ల ఆశీస్సులు పొందారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.